


## 7న బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

చేర్యాల, ఫిబ్రవరి 5: ఈనెల 7న జనగామ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 6న జరగాల్సిన సమావేశం అధిష్ఠానం ఆదేశాల మేరకు 7వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. సమావేశానికి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

# 'బోయినపల్లి'ని గెలిపిద్దాం

- మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

కోహెడ, ఫిబ్రవరి 5: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి బరిలో దిగనున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపిద్దామని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని వేంకటేశ్వర గార్డెన్స్‌లో మండల స్థాయి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీశ్ కుమార్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి.. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రేవంత్‌రెడ్డి ఇకనైనా పద్ధతిగా మాట్లాడడం నేర్చుకోవాలని సూచించారు. కాంగ్రెస్ వైఫల్యాలను కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి వివరించాలన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, ఏఎంసీ చైర్మన్ తిపారపు జ్యోతి, నాయకులు కొక్కుల సురేశ్, ఇప్పరపల్లి అనంతరాములు, గొండ రవీందర్, అబ్దుల్ రహీం, కోనె శేఖర్, లోనె మల్లేశం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సతీశ్‌కుమార్


హాస్టల్ విద్యార్థులకు సూచనలు చేస్తున్న జిల్లా బీసీ సంక్షేమాధికారిణి సరోజ

## విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 5 : సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా బీసీ సంక్షేమాధికారిణి సరోజ సూచించారు. సోమవారం గజ్వేల్ బాలబాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టళ్లను ఆమె తనిఖీ చేశారు. హాస్టళ్లలో ఉన్న సమస్యలను పరిశీలించి విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులంతా ఉత్తమ మార్కులు సాధించి సంక్షేమ హాస్టళ్లకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆమె వెంట బీసీ సహాయ సంక్షేమాధికారి మురళి, వార్డెన్లు లక్ష్మి, దేవదాస్, జానకీరామ్, విద్యార్థులు ఉన్నారు.

## పాకల తొలగింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

బెజ్జంకి, ఫిబ్రవరి 5: మండలంలోని గూడెం గ్రామంలోని పశువుల పాకలను అధికారులు తొలగించడంతో రైతులు, గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నం. 321లో చాలా మంది గ్రామస్తులు పశువుల పాకలు, గొర్రెల షెడ్లు, ఇండ్లను నిర్మించుకున్నారని తెలిపారు. అప్పటి ప్రభుత్వం పశువుల పాకలు, షెడ్లు, ఇండ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇచ్చిందన్నారు. కానీ, ఇప్పుడువున్న తహసీల్దార్ శ్యామ్, ఇతర అధికారులు తమకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా జేసీబీ సహాయంతో శాశ్వత నిర్మాణాలను తొలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తుండంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఎస్‌కె హైదర్‌పటేల్ తదితరులు

## బాలికల వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 5: గజ్వేల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం బాలికల ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఎస్‌కే హైదర్‌పటేల్ క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో జిల్లాలోని 10 పాఠశాలల బాలికల జట్లు పాల్గొన్నాయి. మొదటి స్థానంలో జడ్పీహెచ్‌ఎస్ ఆర్అండ్ ఆర్ కాలనీ గజ్వేల్, ద్వితీయ స్థానం జడ్పీహెచ్‌ఎస్ ధర్మాజీ పేట దుబ్బాక, తృతీయ స్థానంలో అభ్యాస ఇంటర్నేషనల్ స్కూల్ తూప్రాన్ నిలిచింది. అనంతరం విజేతలకు ట్రోఫీలు, పాల్గొన్న జట్లకు మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు విజయరేఖ, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీలు నవీన్, జైపాల్ రెడ్డి, పీడీ రవీందర్‌రెడ్డి, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు సంతోష్, ఆర్గనైజర్లు ప్రభు, సందీప్, కిరణ్, భానుప్రసాద్, విజయ్ కుమార్, తిరుపతి, అజయ్, యేసు రాజు, ప్రవీణ్, సాయికిరణ్, దివ్యరేణుక, లావణ్య, భార్గవి, భాగ్యశీల, అంకిత, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

## శివశంకర.. మహాదేవ

కొండపాక, ఫిబ్రవరి 5: 'శివశంకర.. మహాదేవ' అంటూ భక్తుల శివనామస్మరణతో దుద్దెడ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. నాటి నుంచి నేటి వరకు ఏటా ఈ క్షేత్రంలో ఉత్సవాలు నిర్వహించుకోవడం ఆనవాయితీ. సోమవారం అంకురార్పణ జరిపి గణపతి పూజతో జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వస్తిహావాచనం, మండపారాధన, శివునికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అన్నాభిషేకం, అలంకరణ, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం అలంకరణ, ఒడి బియ్యం సమర్పణ కార్యక్రమాలు కనుల పండువగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ముఖ్యమైన ఘట్టం శకటోత్సవం(బండ్లు తిరుగుట) నేత్ర పర్వంగా సాగింది. సంప్రదాయబద్ధంగా నర్ర గోపాల్‌రెడ్డి కుటుంబానికి చెందిన బండి మొదట బయలుదేరగా, పోల్‌రెడ్డి బుచ్చిరెడ్డి వంశస్తులకు చెందిన బండి అనుసరించింది. కోట శ్రీనివాసశర్మ, తమ్మలి శంకరయ్య, వ్యాస్ నారాయణ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు, భక్తులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.


బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

## కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

దుబ్బాక టౌన్, ఫిబ్రవరి 5: తెలంగాణ గుజుర్యూ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లో జరిగిన ఇండో-నేపాల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో దుబ్బాక విద్యార్థులు సత్తాచారని కోచ్ బురాని శ్రీకాంత్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 2 వేల మంది విద్యార్థులు పాల్గొనగా, దుబ్బాకకు చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొని మూడు గోల్డ్ మెడల్స్, 11 సిల్వర్ మెడల్స్, 6 బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులకు చాంపియన్‌షిప్ కప్‌తో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారని తెలిపారు.

## సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాకు మూడోస్థానం

గజ్వేల్, ఫిబ్రవరి 5 : మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో ఈనెల 3,4న రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 19 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా, రాష్ట్ర స్థాయిలో సిద్దిపేట జిల్లా మూడోస్థానంలో నిలిచింది. సిద్దిపేట జిల్లా జట్టు తరపున ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు లాస్య, సంస్కృతి, స్నిగ్ధశ్రీ సత్తాచాటారు. జట్టు విజయానికి కృషి చేసిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఇన్నారెడ్డి, ప్రిన్సిపాల్ రాయప్ప అభినందించారు.

## కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతాం

సిద్దిపేట కమాన్, ఫిబ్రవరి 5 : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని బీఆర్‌టీయూ నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అరవింద్ అధ్యక్షతన బీఆర్‌టీయూ అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న నిర్వహించనున్న ర్యాలీలో బీఆర్‌టీయూ అనుబంధ సంఘాలన్నీ పాల్గొనాలని తీర్మానించారు. సమావేశంలో బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి మంచె నర్సింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు, మెడికల్ అండ్ హెల్త్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, బీడీ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శోభన్, రైస్ ఆయిల్ మిల్ అధ్యక్షుడు కుమార్, ఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంకణాల శ్రీమతి, కట్టే మిషన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు సంజీవ్, బీఆర్‌టీయూ నంగునూరు మండల అధ్యక్షుడు సిద్ధేశ్వర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్‌టీయూ నాయకులు

## రక్తదానం గొప్పది

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 5 : రక్తదానం.. ప్రాణదానంతో సమానమని వాసవి క్లబ్ ప్రతినిధి పుల్లూరి శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ దవాఖాన బ్లడ్ బ్యాంకులో బ్లడ్ నిలువలు పెంచడానికి సిద్దిపేట వాసవీ, వనిత క్లబ్‌లు సామాజిక బాధ్యతగా స్వీకరించాయి. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో దాతలు యాదగిరిరెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీనివాస్, యాదగిరిలు రక్తదానం చేశారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాణి, సుష్మ, డాక్టర్ స్వాతి, ఆంజనేయులు, ఇమ్రాన్, స్వామి, వీరేశం తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేటలో రక్తదానం చేస్తున్న దాతలు

# వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి

చేర్యాల, ఫిబ్రవరి 5 : పట్టణంలో వ్యాపారాలు కొనసాగిస్తున్న ప్రతిఒక్కరూ ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని చేర్యాల మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో 1632 నివాసేతర ఎలక్ట్రిసిటీ కనెక్షన్లు ఉన్నాయని, నివాసేతర కనెక్షన్ ఉన్న ప్రతి సంస్థ విధిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. చాలావరకు వ్యాపార సంస్థలు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. వ్యాపార సంస్థలు విధిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని కమిషనర్ రాజేంద్ర కుమార్ హెచ్చరించారు.

**హుస్నాబాద్‌లోనూ...**

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 5 : వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ బాల ఎల్లం, జూనియర్ అసిస్టెంట్ జాలిగం శంకర్ సూచించారు. సోమవారం పట్టణంలో పలు వ్యాపార దుకాణాలకు సంబంధించిన ట్రేడ్ లైసెన్స్‌లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోవాలని, కొత్తగా వ్యాపారం నిర్వహించే వారు తప్పనిసరిగా లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోని వ్యాపార సంస్థలను సీజ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


హుస్నాబాద్‌లో హోటల్ నిర్వాహకురాలికి నోటీసు ఇస్తున్న జూనియర్ అసిస్టెంట్

## అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదు

గజ్వేల్, ఫిబ్రవరి 5: ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని జడ్పీటీసీ సభ్యుడు పంగ మల్లేశం సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 2న మండల పరిధిలోని కొడకండ్ల వద్ద కొండపోచమ్మ కాల్వ నుంచి కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేసిన సమయంలో అధికారులు కనీసం సమాచారం కూడా ఇవ్వలేదన్నారు. ఈ విషయం గురించి ఇరిగేషన్ డీఈ నారాయణకు ఫోన్ చేసి అడిగితే తనకు సంబంధం లేదని, ఎస్ఈ వేణుకు తెలుసని చెప్పారన్నారు. ఆయకు ఫోన్ చేస్తే కనీసం స్పందించడం లేదన్నారు. ఇరిగేషన్ అధికారులు ఒకరిపై ఒకరు చెబుతూ దళితుడైన తనను అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

## రేషన్ దుకాణాల తనిఖీ

సిద్దిపేట, ఫిబ్రవరి 5 : రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారి తనుజ, అధికారులతో కలిసి సోమవారం సిద్దిపేట పట్టణంలో రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. సోషల్ ఆడిట్ బినామీ డీలర్లు జిల్లాలో ఎవరైనా ఉన్నారా.. అనే అంశంపై కొన్ని రేషన్ దుకాణాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. రేషన్ డీలర్లకు సంబంధించిన బియ్యం తూకంలో ఏమైనా సమస్యలు, సాంకేతిక లోపాలు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా జిల్లాలో బినామీ డీలర్లు ఎక్కడ ఉన్నా వారి లిస్టు వెంటనే ఇవ్వాలని సంబంధిత అధికారులను జిల్లా పౌరసరఫరాల అధికారి తనుజ ఆదేశించారు. తనిఖీల్లో డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షుడు దొమ్మాటి రవీందర్, కౌన్సిలర్లు ఎడ్ల అరవిందరెడ్డి, అంగన్‌వాడీ టీచర్ వనిత, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 5: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఇటీవల గజ్వేల్‌లో జరిగాయి. ఈ పోటీల్లో సిద్దిపేట శ్రీవాణి పాఠశాల విద్యార్థులు ఐశ్వర్య, కేదరీనాథ్, అనన్య ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి అందుకున్నారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించి మెమోంటోలు అందజేశారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ సత్యం మాట్లాడుతూ జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

## రాష్ట్రస్థాయికి గౌరవెల్లి ప్రభుత్వ పాఠశాల ప్రాజెక్ట్ ఎంపిక

అక్కన్నపేట, ఫిబ్రవరి 5 : మండలంలోని గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి రూపొందించిన వాటర్ బకెట్ క్యారియర్ ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రాజెక్ట్ గైడ్ టీచర్ శ్రీనివాస్, విద్యార్థి శివాజీని శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థి శివాజీ, గైడ్ టీచర్ శ్రీనివాస్ కలిసి వాటర్ బకెట్ క్యారియర్ ప్రాజెక్ట్‌ను రూపొందించి జిల్లా స్థాయిలో ప్రదర్శించారని తెలిపారు. మొత్తం 1666 ప్రాజెక్ట్‌లు రాగా, 156 ప్రాజెక్ట్‌లను జిల్లా స్థాయికి ఎంపిక చేశారని చెప్పారు. ఫిబ్రవరి 1, 2వ తేదీల్లో మూల్యాంకనం చేసి రాష్ట్ర స్థాయికి 15 ప్రాజెక్ట్‌లను ఎంపిక చేశారని, ఇందులో గౌరవెల్లి పాఠశాల తరపున రూపొందిన ప్రాజెక్ట్ 6వ స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రస్థాయికి స్కూల్ ప్రాజెక్ట్ ఎంపిక కావడంతో జిల్లా సైన్స్ అధికారి కల్లెపల్లి శ్రీనివాస్, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.


స్నేహితుడి కూతురుకు ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

## స్నేహితుల చేయూత

రాయపోల్, ఫిబ్రవరి 5 : పదో తరగతి వరకు కలిసి చదువుకున్న తోటి స్నేహితుడికి పూర్వవిద్యార్థులు అండగా నిలిచారు. రాయపోల్ గ్రామానికి చెందిన మహ్మద్ జహంగీర్ బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి కుంటుబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం మండల కేంద్రంలోని జీఎల్ఆర్ గార్డెన్‌లో జరిగిన జహంగీర్ కూతురు పెండ్లికి తోటి విద్యార్థులు హాజరై రూ.75 ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన వారిలో మామిడి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నాగార్జునరావు, అంజిరెడ్డి, వెంకట్‌గౌడ్, సందీప్‌రెడ్డి, యాదగిరి, బెస్త వెంకట్, నర్సగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మల్లేశం తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

## జిల్లా గ్రంథాలయ సర్వసభ్య సమావేశం

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 5 : సిద్దిపేట కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధ్యక్షతన జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2023-24 సంవత్సరానికి సంబంధించి అంచనాలు, పద్దుల వారీగా అయిన నికర ఖర్చులపై చర్చించి బడ్జెట్ అంచనాలకు ఆమోదం తెలిపారు. గ్రంథాలయాల్లో పాఠకులకు కల్పిస్తున్న వసతులు, ఇబ్బందులను గురించి అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కావాల్సిన పోటీ పరీక్షల పుస్తకాలు, మంచినీటి వసతి, ఫ్యాన్లు, కుర్చీలు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో గ్రంథాలయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన పథకాల పేరు మార్చడం తప్ప ప్రజలకు చేసిందేమీలేదని బీఆర్ఎస్ నాయకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి సారించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పరుష పదజాలంతో కేసీఆర్‌ను విమర్శించడం మానుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్, ఎంపీపీలపై అవిశ్వాసం పెడుతూ.. ప్రజాప్రతినిధులను కొనుగోలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని సూచించారు.



కోహెడలో ఇంద్రనీల్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న కార్యకర్తలు


## ఇంద్రనీల్ పుట్టిన రోజు వేడుకలు

కోహెడ, ఫిబ్రవరి 5 : మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ తనయుడు ఇంద్రనీల్ పుట్టినరోజు వేడుకలను సోమవారం మండల పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. వేడుకల్లో కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖదీర్, యువత నాయకులు జాలిగాం శంకర్, పోలవేని కుమారస్వామి, వట్టిపెల్లి రవీందర్‌రెడ్డి, ఎర్ర వెల్లి శ్రీనివాస్, బబ్బురు శ్రీనివాస్, మంద సురేశ్, పిడిశెట్టి రాజు, ఆరె జగదీశ్, వేముల రమేశ్, అక్తర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయంపాలన దినోత్సవం

మిరుదొడ్డి, ఫిబ్రవరి 5: మండలంలోని చెప్యాల ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



చెప్యాలలో స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా సత్కారం పొందిన మాజీ సర్పంచులు

# సర్పంచుల సేవలు అభినందనీయం

- ఎంపీపీ లక్ష్మీబీలూనాయక్

అక్కన్నపేట, ఫిబ్రవరి 5 : గ్రామాల అభివృద్ధిలో ఐదేండ్లపాటు సర్పంచులు అందించిన సేవలు అభినందనీయమని ఎంపీపీ లక్ష్మీ బీలూనాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అన్ని గ్రామాల మాజీ సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ కాలం పూర్తి చేసుకున్న సర్పంచులను పూల మాల, శాలువాలు, మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సర్పంచుల పదవీ కాలం ముగిసినా ప్రజా జీవితంలోనే కొనసాగాలని ఆకాంక్షించారు. గ్రామ పౌరులుగా ప్రజా సమస్యలపై స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. గ్రామాల్లో డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, నర్సరీలు, పల్లె ప్రకృతివనాలు, క్రీడాప్రాంగణాలు, ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ట్రాక్టర్, ట్యాంకర్, ట్రాలీ, చెత్త సేకరణ, పారిశుధ్యం పనులు, వీధి దీపాలు, పరిశుభ్రత వంటి అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొప్పుల సత్యపాల్‌రెడ్డి, ఎంపీవో కవి కుమార్, సూపరింటెండెంట్ శంకరయ్య, ఎంపీటీసీలు పెసరు సాంబరాజు, వేముల శ్రీనివాస్, భూపతి సుదేష్ణ, ఏపీవో ప్రభాకర్, అన్ని గ్రామాల తాజా, మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమలాకర్‌రెడ్డి

## రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

మిరుదొడ్డి, ఫిబ్రవరి 5: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి, భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు జస్వంత్‌రెడ్డి కోరారు. సోమవారం మిరుదొడ్డిలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువుతో పంటలు సమృద్ధిగా పండించుకోవాలని సూచించారు. రైతు సమస్యల పరిష్కారానికి భారతీయ కిసాన్ సంఘ్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. సమావేశంలో ఎంపీటీసీ నర్సింహులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశం, రైతులు రాజిరెడ్డి, మల్లయ్య, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నర్సాయపల్లి అభివృద్ధికి కృషి


నర్సాయపల్లి మాజీ సర్పంచ్ లలితాకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 5 : నర్సాయపల్లి గ్రామ సమగ్రాభివృద్ధికి తన శాయశక్తులు కృషి చేశానని మాజీ సర్పంచ్ బద్దిపడిగె లలితాకృష్ణారెడ్డి తెలిపారు. పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లలితాకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో ఎన్నో అభివృద్ధి పనులు చేశానన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఐదేండ్లపాటు తనకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి రాధిక, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, ఏఎంసీ డైరెక్టర్ శనిగరం సత్యనారాయణ, మాజీ ఉపసర్పంచ్ చింతల ఎల్లయ్య, రేషన్ డీలర్ బాదల్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు తవిటి యాదగిరి, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు పోతుగంటి రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల నాయకులు మహేందర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, హన్మారెడ్డి, ఎల్లయ్య, బాలనర్సయ్య, మధు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సన్మానం

చేర్యాల, ఫిబ్రవరి 5 : ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు సౌమ్య, సంజయ్, హేమచందర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 14 వరకు రాజస్థాన్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో విద్యార్థులు పాల్గొనున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్కే అఖిల్, ఎండీ రఫత్ ఉమర్, రాజుగౌడ్, సెలక్షన్ కమిటీ చైర్మన్ కొండయ్య, అంబాల రాము, గోపి, సంతోష్, బడేమియా పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319429-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.